# 2

# విశ్వాస భ్రష్టత్వం: ఇందుకు గల కారణం మరియు నివారణ

## (3:1-4:13)

క్రైస్తవులలో కొంతమంది పడిపోకుండా ఉండుటకు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక వ్రాయబడింది (ఉదాహరణకు చూడు 2:1; 6:4-6; 10:26-31). హెబ్రీయులకు 3, 4లో గ్రంథకర్త విషయానికొస్తున్నాడు. విశ్వాస భ్రష్టత్వం గురించి ఇక్కడొక ప్రసంగమును ఇస్తున్నాడు. అతని చదువరులకు అది అవసరం. మనకూ అది అవసరమే! క్రొత్త నిబంధన కాలంలో అనేకమంది క్రైస్తవులు పడిపోయారు. ఈనాడు ఎంతోమంది పడిపోతున్నారు. సువార్తను అంగీకరించిన వారిలో 50 శాతం, అంతకంటే ఎక్కువమంది క్రీస్తును విడిచిపెట్టేస్తున్నారని ఒకరు లెక్క వేశారు. అప్పటికి, ఇప్పటికీ కూడా విశ్వాసాన్ని విడిచిపెట్టేయడం ఒక సమస్యే! అయితే ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుంది? ఈ ప్రశ్నకు 3 మరియు 4 అధ్యాయములు కొన్ని సమాధానములను ఇస్తున్నాయి.

ఈ పాఠములో, హెబ్రీ గ్రంథకర్త అందిస్తున్న ప్రసంగమును అధ్యయనం చేసి, ఇది మనకు ఎలా అన్వయిస్తుందో గమనించుదాము.

### ప్రసంగం

**పరిచయం**

ఈ ప్రసంగ ప్రారంభములో తదుపరి చర్చకు కావలసిన ఉపోద్ఘాతం కనబడుతుంది. హెబ్రీయులకు 3:1-6తో దీనిని చదువండి. పరిచయ భాగం మనకు కనబడుతుంది.

ఈ వచనములలో మోషేను క్రీస్తుతో పోల్చడం ద్వారా ప్రసంగమునకు తన శ్రోతలను సిద్ధపరుస్తున్నాడు గ్రంథకర్త. మోషే క్రీస్తుతో పోల్చబడినట్లయితే, అదేవిధంగా, మోషే ద్వారా నడిపించబడిన ఇశ్రాయేలీయులు క్రీస్తు ద్వారా నడిపించబడుతున్న సంఘమునకు పోల్చబడవచ్చు.

"అపొస్తలుడును, ప్రధానయాజకుడైన యేసు మీద లక్ష్యముంచుడి" (3:1) అన్న మాటలతో గ్రంథకర్త ప్రారంభిస్తున్నాడు. దేవుని వాక్కును మానవులకు అందించుటకు దేవుని సందేశకునిగా యేసు "అపొస్తలుడైయున్నాడు." మన "ప్రధానయాజకునిగా" మన అవసరతలను దేవుని యొద్దకు తీసుకువెళ్ళి మన పక్షాన తండ్రికి విజ్ఞాపన చేయుచున్నాడు.

తరువాతదిగా, నమ్మకత్వపు విషయంలో క్రీస్తు మోషే వంటి వాడని చూస్తున్నాము. ఆయన మోషే కంటే శ్రేష్ఠుడు ఎందుకంటే, ఇంటి కంటే ఇంటి నిర్మాణకుడు శ్రేష్ఠుడు కాబట్టి (3:2, 3). ఒక సేవకునిగా మోషే నమ్మకస్థుడైయుండగా, ఆ ఇంటి కుమారునిగా క్రీస్తు నమ్మకస్థుడైయున్నాడు (3:5, 6).

ఇశ్రాయేలు దేవుని ఇల్లయియున్నట్టుగా ఈనాడు మనం దేవుని గృహమైయున్నాము (3:6బి), ఇందును బట్టి ఇశ్రాయేలు పరిస్థితి మనకు ఒక పాఠంగా ఉంది.

**వాక్యం**

తరువాతదిగా, తన ప్రసంగం నిమిత్తం గ్రంథకర్త కీర్తన 95:7–11 వాక్య భాగమును ఉదహరిస్తున్నాడు. (చదవండి హెబ్రీయులకు 3:7–11.)

**ఉద్దేశపు వాక్యం**

వాక్యభాగమును ఉదహరించిన తరువాత, గ్రంథకర్త తన పాఠము యొక్క ఉద్దేశ వాక్యమును వ్రాస్తున్నాడు (చదువండి హెబ్రీయులు 3:12–14). ఈ కొద్ది మాటలలోనే, తన పాఠకులు ఏ విధంగా ఉండాలో వారిని ఒప్పించుటకు ప్రయత్నిస్తున్నాడు. ప్రత్యేకించి 13వ వచనమును గమనించండి. ఈ వచనంలోని ప్రతి పదం ప్రాముఖ్యంగలది:

"బుద్ధి చెప్పుకొనుడి": ఇక్కడ మనం ప్రోత్సాహకర మాటలను చూస్తున్నాము. మనం ఎలా ఉండాలో ఏం చేయాలోనని సూచన చేస్తూ హెచ్చరిక మాట ఇది. నమ్మకస్థులమైయుండుటకు మనకు ఇటువంటి ప్రోత్సాహం కావాలి.

"ఒకనినొకడు": క్రైస్తవ్యం "ఒకరినొకరి" మతము. ఒకవేళ మనమే నమ్మకస్థులమై యుండనట్లయితే, ఇతరులు నమ్మకస్థులైయుండుటకు మనం సహాయం చేయాలి.

"ప్రతి దినమును"[1]: మనం ప్రోత్సాహాన్ని అందించవలసింది వారానికి ఒకసారి కూడుకున్నప్పుడు కాదు గాని, ప్రతి దినమునూ! క్రైస్తవ్యం అనేది "సమూహిక" అవలంబన. క్రైస్తవులు ఒకరినొకరు ప్రతి దినము సహవాసం కలిగియుండాలి.

"మీలో *ఎవడును*": మనలో ఎవరునూ, ఏ ఒక్కరూ కూడాను పడిపోకుండా ఉండడానికి వారికి సహాయం చేయాలి.

"కఠినపరచకుండునట్లు": పాపములో నుండుట అనేది హృదయ కాఠిన్యమును కలుగజేస్తుంది. కాబట్టి ప్రతి దినము హెచ్చరిస్తూ, ప్రోత్సహిస్తూ వాటిని స్వీకరిస్తునుండాలి.

"పాపమువలన కలుగు భ్రమచేత": ఈ మాట పాప స్వభావమును గురించి చక్కగా చెప్తుంది. పాపం భ్రమను కలుగజేసే యుక్తిగలది. ఇది జీవమును గురించి చెప్తూ మరణమును అందిస్తుంది.

ఒకరినొకరం ప్రతిరోజు ఎందుకు ప్రోత్సహించుకోవాలి? ఈ పాఠములో (if) "యెడల" అనే పదం ఉందని (3:6) గమనించండి. "స్థిరముగాచేపట్టిన యెడల మనమే ఆయన ఇల్లు." "మొదటనుండి మనకున్న దృఢవిశ్వాసము అంతముమట్టుకు గట్టిగా చేపట్టినయెడలనే క్రీస్తుతో పాలివారమై యుందుము" (3:14). మన విశ్వాసమును స్థిరముగా చేపట్టనయెడల మనం విశ్వాసహీనులమై పడిపోతాము. "ఇందునుబట్టి మనం ఒకరినొకరము ప్రతిదినము ప్రోత్సహించుకుంటుండాలి."

**అధికాంశం**

ప్రసంగ ఉద్దేశము తరువాత ప్రసంగాంశం వస్తుంది. ప్రసంగం యొక్క ముఖ్య భాగమైన అధికాంశంలో గ్రంథకర్త రెండు ముఖ్య విషయాలనిస్తున్నాడు. మొదటిగా, ఇశ్రాయేలీయుల

యొక్క విశ్వాసహీనతను గురించిన ఉదాహరణను ఇస్తున్నాడు. రెండవదిగా, అటువంటి మాదిరిని తన పాఠకులు అనుసరించ కూడదని వారిని కోరుతున్నాడు.

*విశ్వాసహీనతకు ఉదాహరణగా ఇశ్రాయేలీయులు.* (చదవండి 3:15–19.) ఈ వాక్య భాగములో "వారు కోపము పుట్టించారు" (3:15) అన్న మాటను తెలియజేస్తున్నాడు. ఐగుప్తునుండి బయటకు రప్పించబడిన ఇశ్రాయేలీయులు దేవునికి కోపము పుట్టించారని తను ఉదహరించిన వాక్యభాగమును గ్రంథకర్త వివరిస్తున్నాడు. దాని ఫలితంగా, వారు అరణ్యములోనే చనిపోయారు. వారి అవిధేయత, అవిశ్వాసమును బట్టి "విశ్రాంతిలో" ప్రవేశించలేకపోయారు (అనగా వాగ్దాన దేశములో ప్రవేశించ లేక పోయారు; 11 వ.) (3:16–19). వారి పాపమునుబట్టి ఒక తరము వారందరూ నశించిపోయారు.

*పాఠకులకు వాక్య అన్వయింపు.* (చదవండి 4:1–11.) నాలుగవ అధ్యాయంలో కనబడే అన్వయింపు తన చదువరులకు గ్రంథకర్త ఉద్దేశించినది. "ఆయనయొక్క విశ్రాంతిలో ప్రవేశించుదుమను వాగ్దానము ఇంకను నిలిచియుండగా ..." అన్న మాటలతో వాక్య భాగం ప్రారంభమవుతుంది. మనవలెనే ఇశ్రాయేలీయులకు కూడ "సువార్త" ప్రకటించబడిందని గ్రంథకర్త పేర్కొంటున్నాడు. అయితే వారికున్న అవిశ్వాసముబట్టి వారి వాగ్దానముల ఫలమును వారు అనుభవింపలేక పోయారు (4:2).

ఇశ్రాయేలీయులు వాగ్దాన విశ్రాంతిలో ప్రవేశింపలేకపోయారు గనుక ఆ విశ్రాంతి నెరవేర్పు నొందకుండానే నిలిచిపోయింది. కీర్తన 95లో దేవుడు పలికిన ఆ విశ్రాంతి, సృష్టారంభములో ప్రారంభమై (4:3, 4). మరియు ఆయన దావీదుతో పలికిన మాటల ద్వారా ఇంకనూ నిలిచే యున్నది (చూడు హెబ్రీయులకు 4:5). మోషే, యెహోషువల నుండి నాలుగువందల సంవత్సరాల తరువాత మరియు క్రీస్తునకు వెయ్యి సంవత్సరములముందు జీవించిన దావీదు దేవుని విశ్రాంతిలో కొంతమంది ప్రవేశింపరని సాక్ష్యం చెప్పాడు. దేవుని విశ్రాంతి ఇంకా నిలిచేయున్నదన్న సత్యమును అతని ప్రవచనం స్పష్టం చేస్తుంది (ఎందుకంటే, ఇశ్రాయేలీయులు ఈ వాగ్దానమును అనుభవించలేకపోయారు 4:8). దావీదు ఇక్కడ వర్తమాన కాలమునుపయోగించి మాట్లాడుతున్నాడు. "నేడు" అను పదమును పేర్కొంటున్నాడు. "మీ హృదయములను కఠినపరచుకొనకుడి" (కీర్తన 95:7, 8). ఆ విశ్రాంతి అతని కాలములో లభించింది. అలాగే, మొదటి శతాబ్దపు క్రైస్తవులకూ అది అందుబాటులో ఉంది. అంతేగాక, ఇది ఆది క్రైస్తవులకు అందుబాటులోనున్నట్లయితే, మనకునూ ఈ నాటికీ అందుబాటులోనున్నట్లే! హెబ్రీయులకు 4:1–10లో హెబ్రీ గ్రంథకర్త స్పష్టం చేస్తున్న విషయం ఒక్కటే, ఇశ్రాయేలు ఏ అవకాశాన్నైతే కోల్పోయిందో, అది ఇప్పుడు మనకు అందుబాటులో ఉంది: అదే, దేవుని విశ్రాంతిలో మనం ప్రవేశించగలుగుతున్న అవకాశము.

ఆ విశ్రాంతి ఏమిటి? ఇది "(సబ్బాతు) విశ్రాంతి" అని పిలువబడింది (4:9), కానీ ఇది సబ్బాతు దినం కాదు. ఇది పరలోకపు విశ్రాంతి; దేవుడు తన పనుల నుండి విశ్రాంతి తీసుకున్నట్లే, మనమూ పరలోకం వెళ్ళిన తరువాతనే మన పనులనుండి విశ్రాంతిని పొందగలుగుతాము (4:10; చూడు ప్రకటన 14:13).

ఇశ్రాయేలీయులు విశ్రాంతిలో ప్రవేశింపలేకపోయినట్లే, క్రీస్తు ప్రభువు శిష్యులు కూడ పరలోకపు విశ్రాంతిలో ప్రవేశించుటలో తప్పిపోవచ్చు. కాబట్టి క్రైస్తవులకు దేవుని హెచ్చరిక అవసరం. "హృదయములను కఠినపరచుకొనకుడి." గ్రంథకర్త వారిని ఏం

చేయమని కోరుతున్నాడో మనమూ దానిని చేయాలి – “కాబట్టి అవిధేయతవలన వారు పడిపోయినట్లుగా మనలో ఎవడును పడిపోకుండ ఆ విశ్రాంతిలో ప్రవేశించుటకు జాగ్రత్త పడుదుము”[2] (4:11).

## ముగింపు

హెచ్చరిక మరియు ప్రోత్సాహముతో ఈ ప్రసంగం ముగించబడింది (చదవండి 4:11–13): “ఆ విశ్రాంతిలో ప్రవేశించుటకు జాగ్రత్తపడుదుము.” ఇది క్రైస్తవుల విశ్రాంతి, పరలోకం. తరువాత రెండు వచనములలో ప్రోత్సాహం అందించబడింది. విశ్రాంతిలో ప్రవేశించుటకు ఎందుకు జాగ్రత్తపడాలి? ఎందుకంటే, దేవుని వాక్యం సజీవమై బలముగలదై, హృదయములలో చొచ్చుకుపోవుచున్నది. 4:12, 13లో చెప్పబడిన మాటలు దేవుని వాక్య విషయంలో సత్యములైయున్నవి. ఈనాడు అవే మాటలు బైబిలు విషయంలో సత్యములైయున్నవి. 3వ అధ్యాయంలో ఉదహరించబడిన వాక్యములో దావీదు చెప్తున్న మాటలు సత్యములు అని ఈ వచనం నొక్కి చెప్తుంది. మొదటి శతాబ్దంలోని క్రైస్తవులు తాము జాగ్రత్తగలవారమని చూపించుకొన అవసరం ఉంది లేదా ఇశ్రాయేలీయుల అజాగ్రత్త ఫలములో తాము పాలుపొందవలసియుందని గమనించనవసరం ఉంది.

## అన్వయింపు

ఈ ప్రసంగమును మన జీవితములకు ఎలా అన్వయించుకోగలం? దీనినుండి మూడు ప్రాథమిక విషయాలను మనం నేర్చుకోగలము:

*విశ్వాస భ్రష్టులమైయ్యే అవకాశం.* కొంతమంది భావములకు విరుద్ధంగా, విశ్వాస భ్రష్టత్వం అనేది ఎవరికైనా రావచ్చు. శాశ్వతంగా నశించిపోయే విధంగా క్రైస్తవులు పాపం చేయవచ్చు. విశ్వాస భ్రష్టత్వం అనేది అసాధ్యమయితే, హెబ్రీయుల పత్రిక అర్థంలేనిదిగా యుంటుంది. క్రైస్తవునికి రక్షణ అనేది నియమబద్ధమైనది. అరణ్యములో నశించిపోయిన ఇశ్రాయేలీయుల ఉదాహరణ దీనికి సాక్ష్యము.

*విశ్వాస భ్రష్టత్వమునకు గల కారణం.* అపనమ్మకం అని ఈ వాక్యభాగం చెప్తుంది. ఇశ్రాయేలీయుల విశ్వాస భ్రష్టత్వమును వివరించుటకు ఎన్నో పదాలు వాడబడ్డాయి. హృదయములను కఠినపరచుకొని కోపము పుట్టించారు (3:8); హృదయాలోచనలో తప్పిపోవుచున్నారు (3:10); పాపము చేశారు (3:17); అవిధేయులయ్యారు (3:18; చూడు 4:6). అయితే వారి ప్రాథమిక సమస్య అవిశ్వాసం. “కాగా వారు అవిశ్వాసము చేతనే వారు ప్రవేశింపలేకపోయారని గ్రహించుచున్నాము” (3:19; చూడు 3:12 మరియు 4:2). కథను జ్ఞాపకం చేసుకోండి. మిగతా విషయాలు గాక, ఎర్ర సముద్రమును వారు ఎదుర్కొన్న సందర్భంలో వారి సణుగుడును జ్ఞాపకం చేసుకోండి. వారు నీళ్ళులేనందుకు, ఆహారం లేనందుకు సణిగారు. భయము చేత కనానులో ప్రవేశించుటకు వెనుకాడారు. ప్రతి సందర్భంలోనూ వారి అపజయం వెనుక అవిశ్వాసమే కనబడుతుంది! నిజానికి వారు అవిధేయులు; వారి అవిశ్వాసమునకు కారణం వారి అవిధేయత.

ఇదే విషయం మన విషయములోనూ సత్యము: మనకు దేవుని సహాయం అవసరం లేదని మనం భావించవచ్చు. దేవుడు చెప్పినది చేస్తాడని మనం నమ్మకపోవచ్చు. అవిశ్వాసం

వలన దేవుడు చేయకూడదన్నది మనం చేస్తాము. దేవుడు చేయమన్నది చెయ్యలేము. అపనమ్మకం విశ్వాసహీనతకు ప్రాథమిక కారణము.

*విశ్వాస భ్రష్టత్వ నివారణ.* విశ్వాసహీనతను ఎలా నివారించవచ్చున్న విషయాన్ని ఈ వాక్యభాగం నుండి మనం నేర్చుకోవచ్చు. విశ్వాసహీనతను అరికట్టుటకు మూడు పద్ధతులను ఈ వాక్య భాగం అందిస్తుంది: (1) "... భయము కలిగియుందము" (4:1). విశ్వాసహీనతను నివారించుటకు, అలాగు జరుగకుండా, దాని పర్యవసనములను గురించిన భయాన్ని కలిగియుండాలి. (2) "... జాగ్రత్తపడుదము" (4:11). విశ్వాసహీనతను నివారించుటకు, మనం సాధ్యమైనంతవరకు – జాగ్రత్తపడి – నమ్మకస్థులమైయుండాలి. (3) "... ఒకనొకడు బుద్ధి చెప్పుకొనుడి" (3:13). విశ్వాసహీనతను నివారించుటకు, ఇతరులు నమ్మకస్థులైయుండునట్లు ప్రోత్సాహపరచుచూ, ఇతరులు మనలను ప్రోత్సాహపరుచునట్లు చూడాలి. *పడిపోకుండుటకు మనకు మూడు విషయాలు అవసరం:* (1) *విశ్వాసహీనులమయ్యే అవకాశమునుబట్టి జాగ్రత్తపడడం,* (2) *వ్యక్తిగత జాగ్రత్త, మరియు* (3) *పరస్పర ప్రోత్సాహం.*

## ముగింపు

హెబ్రీయుల యొక్క పత్రిక యొక్క మొదటి పాఠకుల వలె నీవు కూడా క్రీస్తునకు దూరమైపోయివుంటే, నీవు ఈ విషయాన్ని గ్రహించాలి. నీవు పడిపోయినాగానీ, క్రీస్తునొద్దకు తిరిగి రాలేనంతగా నీవు పడిపోలేవు. ఆయననుండి ఎంత దూరంగా నీవు పడిపోయినాగాని, నీవు నీ తప్పిదములను ఒప్పుకుంటే, దేవుడు నిన్ను తప్పనిసరిగా చేర్చుకుంటాడు. తిరిగి రావాలంటే, నీవు నీ పాపములను బట్టి మారుమనస్సు పొందాలి (అపొస్తలుల కార్యములు 8:22), వాటిని ఒప్పుకోవాలి (1 యోహాను 1:9), అందునుబట్టి క్షమాపణ నిమిత్తం ప్రార్థనచేయాలి (అపొస్తలుల కార్యములు 8:22; చూడు యాకోబు 5:16). మీరు పడి పోయినట్లయితే తప్పిపోయిన కుమారుని మాదిరిని (లూకా 15) అనుసరించి తండ్రియొద్దకు తిరిగి రండి!

---

సూచనలు

[1]కీర్తన భాగమును యథావిధిగా పేర్కొంటునే "నేడు" అను పదమును చేర్చబడింది. ఎంత కాలము "నేడు"గా పిలువబడుతుంది? కీర్తన 95, హెబ్రీయులకు 3 మరియు దేవుని భావము ప్రకారం, ఎప్పటికీ ఇది "నేడే"; కాబట్టి, మనము ప్రతి దినము ఒకనికొకరము బుద్ధి చెప్పుకుంటుండాలి. [2]ఇశ్రాయేలీయులు అరణ్యములో అవిశ్వాసమును బట్టి నశించారన్న విషయమును క్రైస్తవులకు ఒక పాఠముగా చెప్పు మరో వాక్యభాగం 1 కొరింథీయులకు 10:1–12.